అందం ఒక్కటే సరిపోదు. ఆత్మసౌందర్యం కూడా అవసరం. అప్పుడే మనిషి జీవితం పరిమళిస్తుంది. అంతరాంతరాల్లో నిరంతరం వెలిగే సౌందర్య జ్వాలనే మనిషిని నడిపిస్తుంది. అందం అహాన్ని తెచ్చిపెడితే అది జీవిత పతనానికే దారితీస్తుంది. ఈ విషయం తెలుసుకోడానికి ఒక మనిషికి అరవయ్యేళ్ళ కాలం పట్టడమే అసలు విషాదం. ఈ విషాదాన్ని హృద్యంగా రూపు కట్టించిన కథ ఇది. మంచులా కరిగిపోయే అందం కాదు, మనిషిని ఉన్నత శిఖరాలపై నిలిపే హృదయ సౌందర్యం ఉండాలన్న భావనకు చక్కని రూపం ఇవ్వడం రచయిత్రి శిల్ప నైపుణ్యానికి నిదర్శనం!!



సూరేపల్లి విజయ

# హిమసౌందర్యం



మంచుకొండల మధ్య నిలబడి, చీకటి ముసుగేసుకున్న ఆకాశాన్ని, మబ్బుల చాటున దోబూచులాడే చంద్రుడ్ని చూస్తుంటే, ఆ దృశ్యం ఎంత అపురూపంగా వుంటుంది.

కరిగిపోతున్న అందమైన మంచును చూస్తూ, కరిగిన ఆ హిమ సౌందర్యాన్ని వీక్షిస్తూ వుంటే ఆ అనుభూతి ఎంత పదిలంగా మనసు పొరల్లో నిక్షిప్తమవుతుందో.

ఆ కరిగిపోయే హిమ సౌందర్యం ఎన్ని జీవిత సత్యాలను చెబుతుంది? ఆ జీవిత సత్యాన్ని తెలుసుకోవడానికి తనకు పట్టిన సమయం అ...ర...వ...య్యే...ళ్ళు.

** ** **

తిరిగిరాని గతాన్ని తలుచుకుంటే ఆ గతం తాలూకు స్మృతులు నన్ను నిలదీస్తున్నాయి. నా అహం... నా అందం.... ఏవీ... ఏవీ అంటూ ప్రశ్నిస్తున్నట్టు... ఏదీ ఆనాటి నా అందం... ఏదీ ఆనాటి అహం...

ఈ వయసులోనూ నా జ్ఞాపకాల పేటిక పనిచేస్తోంది. నా జ్ఞాపకాల పేటికను తరచితరచి, తెరిచి చూస్తే... ఎన్ని జ్ఞాపకాలు ఎన్నెన్ని జ్ఞాపకాలు... శిథిలమైన జ్ఞాపకాల మధ్య, కన్నీటి పొరలను చీల్చుకుంటూ వచ్చే ఆ జ్ఞాపకాలన్నీ ఈ వృద్ధాప్యం ముంగిట్లో తచ్చాడుతున్నాయి.

** ** **

అప్పుడు నా వయసు నాలుగేళ్ళు.

అందంగా, ముద్దుగా బొద్దుగా వుండే దాన్ని. ముట్టుకుంటే మాసిపోయే అందం, పట్టుకుంటే కందిపోయే సౌకుమార్యం. మా అమ్మ... నాన్న ఎంత ముద్దుచేసేవారో ఇంటికెవరైనా బంధువులొస్తే నన్ను ముట్టుకోనిచ్చేవారు కాదు. అంత అపురూపంగా చూసుకునేవారు. రోజుకు నాలుగుసార్లు దిష్టి తీయందే నిద్రపోయేది కాదు అమ్మ. "నీ బిడ్డనేమైనా కొరుక్కుతింటామా?" అని బంధువులు కామెంట్ చేసేవారు.

నా తర్వాత ఓ చెల్లెలు కూడా వుంది. నా అంత అందం కాదు దానిది. అమ్మ, నాన్నలకు నేనంటేనే ప్రేమ. నాకు రకరకాల బట్టలు తీసుకునేవాళ్ళు. బోల్డు జాగ్రత్తలు తీసుకునేవాళ్ళు. ఇవన్నీ నాకు మా బామ్మ చెప్పింది కాస్త పెద్దయ్యాక.

** ** **

స్కూల్లో నేనే ఫస్ట్. టీచర్లంతా నా బుగ్గలు నొక్కి ముద్దులు పెట్టుకునేవాళ్ళు. నేను ఇంటికెళ్ళగానే సబ్బుతో బాగా కడుక్కునేదాన్ని. అదిగో అలా అప్పట్నుంచి అందం మీద నాకు కాన్ఫిడెన్స్... వూహుఁ.. అహం పెరిగిందేమో.

** ** **

నన్ను చాపమీద కూర్చోబెట్టారు. ముత్తయిదువులు వచ్చారు. పట్టు లంగా పరికిణి వేశారు. పెద్ద కోలాహలం. పెళ్ళిచేసినంత హడావిడి. ఆరోజు ఓ పదిసార్లయి నా అమ్మ నాకు దిష్టి తీసి వుంటుంది.

చందనపు బొమ్మ అని ఒకరు. పుత్తడి బొమ్మ అని ఇంకొకరు... రకరకాల కామెంట్లు నా అందం గురించి.

గర్వంతో పొంగిపోయేదాన్ని. కాలేజీకి వెళ్తున్నాను. పరికిణీ వేసుకోవడం వచ్చింది. కాలేజీలో అబ్బాయిల చూపులే కాదు లెక్చరర్ల చూపులు కూడా నా మీదే. కళ్ళు తిప్పుకోకుండా చూసేవాళ్ళు.

నన్నే ఫస్ట్ బెంచిలో కూచోమనేవారు. అబ్బాయిలైతే రోజుకొకరు బాడీగార్డులా నాతోపాటు మా ఇంటివరకూ వచ్చేవారు. అయినా వాళ్ళని ఉడికించాలనే మిన్నకుండిపోయేదాన్ని. వాళ్ళ చూపులు నా శరీరాన్ని ఆపాదమస్తకం స్పృశించేవి. నేను నవ్వితే చాలు చొంగ కార్చేవాళ్ళు. నా పరిచయం కోసం తహతహలాడేవాళ్ళు. పాపం నాకోసం మా నాన్న దగ్గరికి వచ్చి బండెడు చాకిరీ చేసేవాళ్ళు. ఇదంతా నా సౌందర్య ప్రభావం.

నేను డిగ్రీకి వెళ్ళేసరికి ఓ రెండొందల ప్రేమలేఖలు అందుకున్నాను. వాటి సంఖ్య అలా పెరుగుతూనే వుంది. నా అందం నాకే అసూయను కలిగించేది. మగాళ్ళ చూపులను కాంప్లిమెంట్స్‌గా భావించేదాన్ని.

సరిగ్గా అప్పుడే విశ్వనాథం పరిచయం అయ్యాడు. అతను పెద్ద అందగాడేం కాదు. అలా అని అనాకారి కాదు. బ్యాంకులో క్యాషియర్. మా ఇంటి ఎదురుగానే వుండేవాడు. చాలా సిన్సియర్. ఆడవాళ్ళను చూస్తే తలదించుకునేవాడు. కానీ పాపం... ఓరోజు తలదించుకోకుండా పొరపాటుగా నా అందం చూసి ఫ్లాటయ్యాడు. అంతే "చేసుకుంటే నిన్నే చేసుకుంటా" అంటూ డిసైడయ్యాడు.

కడివెడు గుమ్మడికాయ కత్తిపీటకు లోకువన్నట్టు.... పాపం అంత మంచి జాబ్ వున్న విశ్వనాథం నాకోసం రోజూ ఉదయమే లేవడం... నాతో మాట్లాడ్డం కోసం పడిగాపులు కాయడం...

ఓరోజు మా నాన్నకు ఏదో బ్యాంకు పని వుంటే వెళ్ళాను. విశ్వనాథం నన్ను చూసి పరుగెత్తుకొచ్చినంత పన్జేసాడు. నా పనులన్నీ తనే చేసాడు. ఆ విషయం నాన్నకు తెలిసి అతనికి కృతజ్ఞతలు చెప్పాడు కూడా. ఆ తర్వాత ఆ పరిచయం పెరిగింది. తన స్కూటర్ మీద కాలేజీకి డ్రాప్ చేసేవాడు. అవసరమైతే ఆరోజు బ్యాంకుకు సెలవు పెట్టేవాడు.

ఇలా ఓ ఏడాది గడిచింది. ఓరోజు విశ్వనాథం డైరెక్ట్‌గా విషయంలోకి వచ్చాడు. మీరంటే నాకిష్టం. మీకభ్యంతరం లేకపోతే కానీ కట్నం అక్కర్లేదు. మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటానన్నాడు.

మా ఇంట్లో కూడా ఆ సంబంధం ఇష్టమే. "అబ్బాయి గుణవంతుడు. మంచి ఉద్యోగం. చెప్పమ్మా నీకిష్టమైతే పెళ్ళి చేసేస్తాం" అన్నారు అమ్మానాన్న.

నేను ఆలోచనలో పడ్డాను. అతణ్ణి పెళ్ళి చేసుకోవాలా? నా పక్కన అతను తేలిపోతాడు.

అతణ్ణి పెళ్ళి చేసుకున్నాక... పిల్లలు... సంసారం... జంఝాటం.... హమ్మో నా అందమంతా తరిగిపోదు. పిల్లలు ముక్కు చీదుళ్ళు పెంచి పోషించడాలు... ఐదేళ్ళు చాలు... నేను అప్పల నర్సమ్మలా మారడానికి.... పైగా నా అంత అందం విశ్వనాథానికి ఎక్కడిది? (అప్ప

టి అజ్ఞానం అలావుంది)

కొన్నిరోజులు నాన్చి, చివరికి తేల్చి చెప్పాను. ఇప్పట్లో పెళ్ళి ఉద్దేశం లేదని.

నాకోసం జీవితాంతం ఎదురు చూస్తానన్నాడు. నా గుండె తలుపులు నీకోసమే తెరిచి ఉంటాయన్నాడు.

ఆ తర్వాత ట్రాన్స్‌ఫర్ కావడంతో అతను వెళ్ళిపోయాడు. నాకు సంబంధాలు వస్తున్నాయి. కాని నేనే తిరస్కరిస్తూ వస్తున్నాను. పెళ్ళి, పిల్లలు నా అందాన్ని పాడుచేస్తాయన్న నా నిశ్చితాభిప్రాయానికి ఊపిరి పోశాను.

అమ్మనాన్నలు ముందు మెత్తగా మందలించి, ఆ తర్వాత తిట్టసాగారు. ఎంకి పెళ్ళి, సుబ్బి చావుకొచ్చింది. నా పెళ్ళి మా చెల్లెలి పెళ్ళికి స్పీడ్ బ్రేకరయింది. ముందు చెల్లెలికి పెళ్ళి చేయమని చెప్పాను.

కాలం ఎవరి కోసం ఆగదు.

చెల్లెలి పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. వాళ్ళు నన్ను పెద్దమ్మా అంటుంటే చిరాకేసేది. నేనేదో ముసల్దాన్ని అయినట్టు... అలా పిలవొద్దని 'ఆంటీ' అనమని చెప్పేదాన్ని. చెల్లెలు చిన్నబుచ్చుకునేది.

అమ్మనాన్న చనిపోయారు.

నేను ఒంటరి దాన్నయ్యాను.

ఇల్లు నాపేరు మీద రాసారు.

చెల్లెలు ఢిల్లీలో ఉంటోంది. ఎప్పుడో సెలవులకు వస్తారు. గడిచిపోయే కాలం ఎన్నో పాఠాలను నేర్పుతుంది. చెల్లెలు పిల్లలు పెద్దయ్యారు. ఒకడు ఇంజనీరు, మరోవాడు డాక్టర్. ఇప్పటికి 'ఆంటీ' అని పిలుస్తుంటే నాకే గిల్టీగా అనిపించింది. చిన్నప్పటి నా మాటలు వాళ్ళకింకా గుర్తున్నాయి. అక్కడక్కడ వెంట్రుకలు తెల్లబడ్డాయి. మోడ్రన్ డ్రస్సులు వేసుకోవడం మానేసి పదేళ్ళయింది. 'ఇంత వయస్సు వచ్చినా ఈ డ్రెస్సులేమిటో' అనే కామెంట్లకు భయపడ్డాను.

కంటిచూపు మందగించింది. కళ్ళకింద నల్లటి చారికలు. అద్దంలో నా మొహం చూసుకోవాలంటేనే భయమేస్తోంది. ఇప్పటికీ నేను అందంగానే ఉంటాను.

మా చెల్లెలు మాత్రం కాస్త లావయింది. అదేమాట అంటే నవ్వి అంది. "అదేమిటక్కా... వయసుతోపాటు మార్పులూ సహజం... అందం హుందాతనంతో వుంటుంది. హుందాతనం పరిపూర్ణత్వంలో వుంటుంది. ఇప్పుడు నేను ఇల్లాలిని. ఇద్దరి పిల్లల తల్లిని. రేపో, మాపో బామ్మను కాబోతున్న వ్యక్తిని. ఇలా వుంటేనే హుందాగా వుంటుంది. అందాన్ని మనమేమైనా కొరుక్కు తింటామా! అయినా భార్యగా భర్త ప్రేమను, తల్లిగా పిల్లల ప్రేమను పొందాను. నాకింకా కోరికలు కూడా లేవు" అంది పెద్ద ఆరిందాలా. అవును మరి జీవితం ఎన్ని పాఠాలు నేర్పుతుంది.

ఈమధ్య బయటకు వెళ్తే నన్నెవరూ చూడటంలేదు. నా అందాన్ని కామెంట్ చేయడంలేదు. పైగా బామ్మ అని కూడా పిలిచాడు మా ఎదురింటి అబ్బాయి.

నాలోఅందమంతా తరిగిపోలేదు. అయినా ఏమిటో మార్పు. సరిగ్గా అప్పుడే జరిగిందా సంఘటన. బాత్రూంలో కాలు జారిపడ్డాను. నడుం విరిగినంత పనయింది. చెల్లెలు కూతురు సేవలు చేసింది. నాకేదు పొచ్చింది. అది లేకపోతే ఏమయ్యేదాన్ని. ఆంటీ అని

**కురిసే మంచు అందంగానే ఉంటుంది. ఆ మంచు కరిగిపోయే దృశ్యమూ అందంగానే ఉంటుంది. కానీ మంచు కరిగిపోయినా ఆ దృశ్యం తాలూకు అనుభూతి మనసు పొరల్లో పదిలంగా ఉంటుంది. అలాగే శారీరక సౌందర్యం వయసుతోపాటు కరిగిపోయినా, అంతరాంతరాల్లో వుండే ఆత్మ సౌందర్యం అందమైన అనుభూతిగా మిగిలిపోతుంది.**

పిలిస్తే నేనే వద్దన్నాను. పెద్దమ్మా అని పిలిచింది. ఎంత మధురంగా వుందా పిలుపు. నాలో ఏదో వెలితి. ఏదో కోల్పోయిన ఫీలింగ్. ఊహు.... ఒంటరి బతుకు అయింది. విశ్వనాథం అడ్రస్ కోసం ప్రయత్నించాను. నెలరోజుల తర్వాత దొరికింది.

అతనన్న మాటలు గుర్తుకొచ్చాయి. ఈ ఊళ్ళోనే అజంపూర కాలనీలో ఉంటున్నాడు. నాకోసం అతని తలుపులు ఎప్పుడూ తెరిచి ఉంటాయన్నాడు.

ఓ ఫైన్ మార్నింగ్ వెళ్ళాను. వణుకుతున్న చేతులతో తలుపు తట్టాను. తలుపు తెరుచుకుంది. ఎదురుగా విశ్వనాథం. తలవెంట్రుకలు అక్కడక్కడ నెరిసాయి. కాస్త ఒళ్ళు చేశాడు. కళ్ళజోడు ఒకటి.

కాస్త పరిశీలనగా చూసి... 'ఎవరు మీరు.... హిమ...." అన్నాడు అస్పష్టంగా.

'అవును' అన్నాన్నేను.

ఈలోగా ఓ అయిదేళ్ళ కుర్రాడు పరుగెత్తుకొచ్చి "చూడు తాతయ్య... పింకీ ఎలా చేస్తోందో" అంటూ చెల్లెలు మీద కంప్లయింట్ ఇచ్చాడు.

నేను షాకయ్యాను. అంటే విశ్వనాథం పెళ్ళి...

** ** **

వరండాలో కూచున్నాము. "నీ కోసం ఏడాది చూశాను. నీలో మార్పులేదు హిమా... జీవితం ఎవరి కోసం ఆగదు. వయసులో అందం వృద్ధాప్యంలో శాశ్వతం కాదు. జీవితంలో పెళ్ళి... పిల్లలు.... మనవలు.... ఇవన్నీ తీపిగుర్తులు. వీటిని నీ క్షణికమైన సౌందర్యం కోసం వదులుకోలేకపోయాను. మా అక్కయ్య కూతుర్ని పెళ్ళి చేసుకున్నాను. అఫ్‌కోర్స్ నీ అంత అందం కాదు తనది. చామనఛాయ. కానీ అంతకన్నా అందంగా అపురూపంగా నన్ను చూసుకుంది. నాకిద్దరు మనవలు ఒక మనవరాలు. మొన్ననే రిటైరయ్యాను. మనవలతో కాలక్షేపం చేస్తున్నాను. అన్నట్టు మా ఆవిడను పరిచయం చేస్తానంటూ లేచాడు.

నేను లేచి చేతులు జోడించి బయటకు వచ్చాను.

** ** **

నేనిప్పుడు ఒంటరిదాన్ని.

నేను వీధిలోకి వెళ్తే నా వెంట వచ్చే బాడీగార్డులు లేరు. నా క్రీగంట చూపు కోసం వెంపర్లాడే అబ్బాయిలూ లేరు. నా చిర్నవ్వు కోసం అర్రులు చాచేవాళ్ళు లేరు. నాకు ప్రేమ లేఖలు రాసేవాళ్ళు లేరు.

పెద్దమ్మా అంటూ ఆప్యాయంగా పిలిచే చెల్లెలి పిల్లలు తప్ప. వాళ్ళకు పెళ్ళిళ్ళయ్యాయి. పిల్లలు పుట్టుకొచ్చారు.

ఈ క్షణికమైన కాలంతోపాటు కరిగిపోయే సౌందర్యానికి నేను విలువనిచ్చి జీవితపు విలువలను, మాధుర్యాలను కోల్పోయాను. కురిసే మంచు అందంగానే ఉంటుంది. ఆ మంచు కరిగిపోయే దృశ్యమూ అందంగానే ఉంటుంది. కానీ మంచు కరిగిపోయినా ఆ దృశ్యం తాలూకు అనుభూతి మనసు పొరల్లో పదిలంగా ఉంటుంది. అలాగే శారీరక సౌందర్యం వయసుతోపాటు కరిగిపోయినా, అంతరాంతరాల్లో వుండే ఆత్మ సౌందర్యం అందమైన అనుభూతిగా మిగిలిపోతుంది.

ఈ నిజం తెలుసుకోవడానికి కరిగిపోయిన సౌందర్యం, కళ్ళు తెరుచుకోవడానికి పట్టిన సమయం అరవయ్యేళ్ళు. అవును నాకిప్పుడు అ...ర...వ...యే...ళ్ళు. ఇప్పుడిప్పుడే ఆత్మసౌందర్యం గూర్చి తెలుసుకుంటున్నాను. కానీ ఇప్పటికే చాలా ఆలస్యమైంది కదూ!

# వ్యాయామం పిల్లల ఆరోగ్యానికి రక్ష!

వ్యాయామం శరీరానికి, మనసుకు ఎంతో మంచిది. చిన్నతనంలోనే పిల్లలకు వ్యాయామం చేయటం నేర్పించటం వల్ల వారి ఎదుగుదలలోనూ, వికాసంలోనూ సమతూకం ఉంటుంది. ముఖ్యంగా టీనేజ్ పిల్లలు రోజూ కనీసం అరగంట అయినా వ్యాయామం చేయటం అవసరం. శారీరకంగా ఫిట్‌నెస్‌తో ఉండడమే కాక, ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండే అవకాశం ఉంటుంది. అనవసరమైన టెన్షన్లు లేకుండా గడపటానికి వ్యాయామం వారికి ఎంతో ఉపయోగపడుతుంది.

వీలున్నవాళ్ళు పిల్లల్ని జిమ్స్‌కు పంపుతారు. ఆ స్థోమత లేకపోతే కనీసం తెల్లవారుజామునే లేచి నడవటం, పరిగెత్తటం వంటి పనులయినా చేయగలగాలి. పొద్దెక్కేవరకు పిల్లల్ని పడుకోబెట్టకుండా వాళ్ళను త్వరగా నిద్ర లేపాలి. అంతేకాదు, రాత్రిళ్ళు త్వరగా పడుకొనేలా చూడాలి. ఇలా చేస్తేనే తప్ప వాళ్ళకు క్రమశిక్షణ అలవడదు.

పిల్లలు ఆటలు ఆడటం కూడా వ్యాయామంలో ఒక భాగమే. ఎప్పుడూ చదువుకొమ్మని పోరు పెట్టకుండా సాయంత్రం పూట గంట, గంటన్నర అయినా ఆటపాటల్లో వారు మునిగితేలేలా ప్రోత్సహించాలి. ఇందుకు ఇంట్లోనూ, స్కూలులోనూ అనువైన వాతావరణం ఉండాలి. దీనికోసం ఎవరికి తోచినరీతిలో వారు తోడ్పడితే పిల్లలు ఆరోగ్యంగానూ, అందంగానూ పెరిగే అవకాశముంది.

చిన్నతనం నుంచి ఈ అలవాట్లు చేస్తే పెరిగి పెద్దయ్యాక కూడా వారు చెరగని చిరునవ్వులతో జీవితాన్ని సాగించడం సాధ్యం

-రేణుక

